

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 18.05.2026 | సంపుటి: 3 | సంచిక: 106 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | MONDAY | 18.05.2026 | VOLUME : 3 | ISSUE : 106 | PAGES: 8 | COST: 2/-

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# బండి చుట్టూ రాజకీయ సెగ

- భగీరథ్ పై పోక్సో కేసుతో పొలిటికల్ ఇమేజ్ డ్యామేజ్
- లొంగుబాటు.. అరెస్టు? భిన్న ప్రకటనలతో గందరగోళం
- హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్ కలకలం
- సోషల్ మీడియా పోస్టులపై కేసులు

**హైదరాబాద్, మే 17(రాజముద్ర న్యూస్):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా, ప్రతిపక్షాలు ఈ వ్యవహారంపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయి.

కొన్ని రోజులుగా కనిపించకుండా ఉన్న భగీరథ్ శనివారం పోలీసుల అదుపులోకి వచ్చాడు. అయితే అతడు స్వయంగా లొంగిపోయాడా..? లేక పోలీసులు అరెస్ట్ చేశారా..? అన్న అంశంపై భిన్న

మిగతా 2వ పేజీలో..





## హైదరాబాద్‌కు మళ్లీ కేసీఆర్ పాలనే అవసరం

- 'మన బూత్ – మన బాధ్యత'లో కేటీఆర్ వ్యాఖ్యలు
- టిమ్స్ ఆస్పత్రులపై ఆందోళనకు సిద్ధం
- కార్పొరేషన్ ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

2

## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

2

## గురుకులాలకు నెలనెలా నిధులు



- డైట్, కాస్మెటిక్, అద్దె బిల్లుల చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్
- రూ.221.24 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఆమోదం
- విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం : భట్టి విక్రమార్క

2

## సరస్వతి అంత్య పుష్కరాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



**హైదరాబాద్, మే17 (రాజముద్ర న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర త్రివేణీ సంగమ క్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి

మిగతా 3వ పేజీలో..

థియేటర్ పర్సంటేజీ వివాదంపై
## ఫిల్మ్ ఛాంబర్ కసరత్తు




- నిర్మాతలు, ఎగ్జిబిటర్లతో కీలక సమావేశం
- సమస్య పరిష్కారానికి ప్రత్యేక సబ్ కమిటీ ఏర్పాటు
- డి.సురేష్‌బాబు చైర్మన్‌గా కమిటీ నియామకం

3

## ఎండలతో తెలంగాణ ఉక్కిరిబిక్కిరి

- ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్
- ఐదు రోజుల పాటు భారీ ఉష్ణోగ్రతల హెచ్చరిక
- కొన్ని జిల్లాల్లో వర్షాల సూచన

2






2

## ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- ఇంజనీరింగ్‌లో రిషికి తొలి ర్యాంక్
- అగ్రికల్చర్, ఫార్మసీలో ముకరం అహ్మద్ టాప్
- రికార్డు సమయంలో ఫలితాల ప్రకటన
- త్వరలో వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్



2

## భగీరథ్‌పై పోలీసులు ఏ విచారణైనా చేయొచ్చు

- ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



3

ప్రేమ వేధింపులతో
## యువతి హత్య

- స్థానికుల దాడిలో నిందితుడి మృతి

## ఉద్యమకారుల గుర్తింపుపై కమిటీ కసరత్తు

- కేశవరావు నేతృత్వంలో తొలి సమావేశం
- నాలుగు కేటగిరీలుగా గుర్తింపు ప్రతిపాదన
- జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణకు నిర్ణయం

2



## యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

- టర్బైన్ పంప్ వద్ద చెలరేగిన మంటలు..
- కాలిపోయిన కేబుల్స్, వాల్వ్‌లు

**నల్గొండ, మే 17 :** నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్

మిగతా 3వ పేజీలో..






మళ్లీ తెరపైకి
## ఐ బొమ్మ వివాదం

- 'బప్పం టీవీ'పై కూడా కేసు నమోదు
- కొత్త వెబ్‌సైట్‌తో సంబంధం లేదన్న ఇమంది రవి


**హైదరాబాద్, మే 17 (రాజముద్ర న్యూస్):** తెలుగు సినీ పరిశ్రమను మరోసారి కలవరపెడుతూ 'ఐ బొమ్మ' వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. పైరసీ వెబ్‌సైట్ల ద్వారా కొత్త సినిమాలను

మిగతా 3వ పేజీలో..

## భగీరథ్‌ను అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫలం

- ఈ కేసులో మూడు వ్యవస్థలు ముద్దాయిలుగా మారాయి
- సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ

2



# బండి చుట్టూ రాజకీయ సెగ

మొదటిపేజీ తరువాయి

ప్రకటనలు వెలువడటం కలకలం రేపుతోంది. బండి సంజయ్ మాత్రం న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించామని ప్రకటించగా, సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాల గాలింపులో భాగంగా మంచిరేవుల సమీపంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. భగీరథ్‌ను విచారించిన అనంతరం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తులో భాగంగా భగీరథ్ నేరాన్ని అంగీకరించాడని సైబరాబాద్ కమిషనరేట్ ప్రకటించడం మరో చర్చకు దారితీసింది. మరోవైపు భగీరథ్ తరపు వర్గాలు మాత్రం ఇది బ్లాక్‌మెయిల్ ప్రయత్నమని ఆరోపిస్తున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరగడం వివాదాస్పదమైంది. బెయిల్ వ్యవహారంపై నిరాధార పోస్టులు రావడంతో హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే సమయంలో భగీరథ్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టారనే ఆరోపణలతో 14 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కూడా కేసులు నమోదయ్యాయి. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా రాజకీయంగా ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# గురుకులాలకు నెలనెలా నిధులు

హైదరాబాద్, మే 17 :

రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన డైట్ చార్జీలు, కాస్మెటిక్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా విడుదల చేయాలని నిర్ణయించింది.

గతంలో ఈ నిధుల చెల్లింపులు 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడంతో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. మొదట త్రైమాసిక చెల్లింపుల విధానం అమలు చేసి, ఇప్పుడు నెలవారీ చెల్లింపుల విధానాన్ని తీసుకొచ్చారు.

ఈ నిర్ణయంతో విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల నిర్వహణ, భవన అద్దెల చెల్లింపులు సక్రమంగా సాగనున్నాయి. విద్యా వాతావరణం మెరుగుపడటానికి ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

నెలవారీ చెల్లింపుల విధానంలో భాగంగా వివిధ సంక్షేమ, విద్యాశాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల కోసం ప్రభుత్వం రూ.221.24 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో విద్యార్థుల సంక్షేమం, వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో మద్దతు లభించనుంది.

అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## భగీరథ్‌పై పోలీసులు
# ఏ విచారణైనా చేయొచ్చు

హైదరాబాద్, మే 17 :

పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీసులకు లొంగిపోయాడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారం పూర్తిగా రాష్ట్ర పోలీసుల పరిధిలోనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి స్వతంత్రంగా దర్యాప్తు చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. బండి భగీరథ్‌పై పోలీసులు ఎలాంటి విచారణైనా నిర్వహించవచ్చని వెల్లడించారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో కేంద్రమంత్రి అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను అక్కడి పోలీసులు అడ్డుకున్న ఘటనను ప్రస్తావిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని తెలిపారు. శనివారం పోలీసులకు లొంగిపోయిన బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ అనంతరం చర్లపల్లి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. మరోవైపు ధాన్యం కొనుగోళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ప్రతి పైసాను కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని, అయినప్పటికీ రైతుల నుంచి ధాన్యం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రులు జిల్లాల వారీగా పర్యటిస్తూ ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

## ఎండలతో తెలంగాణ
# ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్, మే17:




తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అధిక ఎండలతో పాటు వడగాలులు వీచే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు.కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్ మాల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన గాలి విచ్ఛిన్నతి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది.





# హైదరాబాద్‌కు మళ్లీ కేసీఆర్ పాలనే అవసరం

హైదరాబాద్, మే 17:

"హైదరాబాద్ నగరం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం రావాల్సిందే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన బూత్ - మన బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని, ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని కేటీఆర్ విమర్శించారు. గత రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నగరాన్ని సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టిందని ఆరోపించారు.

టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, ఈ అంశంపై త్వరలోనే భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.

హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని చేయాలని కేటీఆర్ సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి నగర సమస్యలను వివరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

- **భగీరథ్ కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలి**
- **బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

హైదరాబాద్, మే 17 :

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో మాట్లాడిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజుల పాటు దాచి పెట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తి కేంద్రమంత్రి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. దేశానికే అవమానకరమని విమర్శించారు. కేంద్ర మంత్రి కుమారుడు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని ఆరోపించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. బాధిత బాలిక తల్లిదండ్రులను స్వయాన కేంద్ర మంత్రే భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అని చెప్పడం మాత్రమే సరిపోదని, ఆ నినాదాలకు అనుగుణంగా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీస్ జారీ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కేసును నీరుగార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. హనీ ట్రాప్ పేరుతో మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కలిసి వార్తలు బయటకు రానీయకుండా చేశారని విమర్శించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. అలా చేయకపోతే అన్యాయం జరిగినా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసే ధైర్యం ఆడబిడ్డలకు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రమంత్రి ఎన్ని రకాల ఒత్తిళ్లు తీసుకొచ్చినా బాధిత బాలికకు ఆమె తల్లి అండగా నిలిచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమ్మక్కై బాలికకు అన్యాయం చేయాలని చూసినా.. ఆ కుటుంబం వెనక్కి తగ్గలేదని తెలిపారు. బాధిత బాలిక తరఫున పోరాటం చేసిన బీఆర్ఎస్ మహిళా విభాగాన్ని ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినందించారు. ఈ కేసులో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా గట్టిగా పోరాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తోందని విమర్శించారు.

## ఉద్యమకారుల గుర్తింపుపై
# కమిటీ కసరత్తు

హైదరాబాద్, మే 17 :

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం కేశవరావు నేతృత్వంలో నిర్వహించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరవీరుల జ్యోతి వద్ద ఉన్న కార్యాలయాన్ని కమిటీ కార్యాలయంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అమరవీరుల గుర్తింపుపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించాలని తీర్మానించారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల సంఘాలు, న్యాయవాదుల సంఘాలు, వివిధ జిల్లాల ఉద్యమ సంస్థల నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా జిల్లా పర్యటనలు చేపట్టి ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయినవారు, గాయపడినవారు, జైలుకు వెళ్లినవారు లేదా కేసులు ఎదుర్కొన్నవారు, క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసినవారిగా నాలుగు కేటగిరీలుగా విభజించి గుర్తింపు ఇవ్వాలని ప్రతిపాదించింది. రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగుతుందని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కమిటీ స్పష్టం చేసింది.



## భగీరథ్‌ను అరెస్ట్ చేయడంలో
# పోలీసులు విఫలం

హైదరాబాద్, మే 17 :

యువతులపై లైంగిక దాడులకు పాల్పడిన పలువురిని ఎన్‌కౌంటర్ చేసిన రాష్ట్ర పోలీసులు.. భగీరథ్‌ను అరెస్ట్ చేయడంలో మాత్రం విఫలమయ్యారని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ ఆరోపించారు. భగీరథ్ కోసం పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెబుతున్నారని, ఆ బృందాలు గోర్లు తీసుకుంటున్నాయా అని ఎద్దేవా చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ.. భగీరథ్‌ను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతుండగా, మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించానని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఈ కేసులో భగీరథ్ ముద్దాయిగా మారాడని, కోర్టు అసమర్థత కూడా బయటపడిందని ఆరోపించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే అరెస్ట్ చేసి ఉంటే ఈ స్థాయికి వ్యవహారం వెళ్లేది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో తప్పు చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ.. ఈ మూడు వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. కేసు నమోదైన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించి ఉంటే ఇంత వివాదం జరిగేది కాదన్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, న్యాయవ్యవస్థ కూడా ముద్దాయిలుగా నిలిచాయని ఆరోపించిన సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ.. ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



# ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే17

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ 2026 ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఫలితాలను ప్రకటించారు.



ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం. రిషి తొలి ర్యాంకు సాధించగా, మూసాపేటకు చెందిన అన్షు రెండో ర్యాంకు, కడపకు చెందిన వంశీధర్‌రెడ్డి మూడో ర్యాంకు దక్కించుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హైదరాబాద్ విద్యార్థి ముకరం అహ్మద్ మొదటి ర్యాంకు సాధించగా, ఎల్‌బీనగర్‌కు చెందిన తాదురి సాయి వెంకట్ రెండో స్థానం, రంగారెడ్డి జిల్లా విద్యార్థిని సాహితి మూడో ర్యాంకు పొందింది. మే 4 నుంచి 11 వరకు నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలకు ఇంజినీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేయగా 1,97,241 మంది పరీక్ష రాశారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా 84,954 మంది హాజరయ్యారు. భారీ స్థాయిలో పరీక్షలు నిర్వహించినప్పటికీ కేవలం ఆరు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం ఈ ఏడాది ప్రత్యేకతగా నిలిచింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంలో తీసుకొచ్చిన డిజిటల్ సంస్కరణలతో పరీక్ష ముగిసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా మార్కులు స్క్రీన్‌పై కనిపించే విధానం అమలు చేసినట్లు అధికారులు తెలిపారు. పారదర్శకతతో పాటు వేగవంతమైన మూల్యాంకన ప్రక్రియ కారణంగానే రికార్డు సమయంలో ఫలితాలు వెల్లడించగలిగామని ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె. విజయకుమార్‌రెడ్డి వివరించారు.

ఫలితాల అనంతరం విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రవేశాల కోసం వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను మరో రెండు మూడు రోజుల్లో ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

# థియేటర్ పర్సంటేజీ వివాదంపై ఫిల్మ్ ఛాంబర్ కసరత్తు

**హైదరాబాద్, మే 17 :**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో థియేటర్ యజమానులు, నిర్మాతల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న పర్సంటేజీ విధానం వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక అడుగు వేసింది. ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఎగ్జిబిటర్ల సెక్టార్‌కు సంబంధించిన పర్సంటేజీల వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు ఫిల్మ్ ఛాంబర్ ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కమిటీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబును నియమించగా, కన్వీనర్లుగా నిర్మాతలు అల్లు అరవింద్, దిల్‌రాజును ఎంపిక చేశారు. సభ్యులుగా కేఎల్ నారాయణ, కె.అశోక్‌కుమార్‌లను నియమించారు.

ఈ సబ్ కమిటీలో నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు సమాన ప్రాధాన్యం కల్పించినట్లు ఫిల్మ్ ఛాంబర్ వెల్లడించింది. థియేటర్ల నిర్వహణ ఖర్చులు, టికెట్ రెవెన్యూ షేరింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై కమిటీ చర్చించనుంది.

వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరించి త్వరలోనే తుది నివేదికను ఫిల్మ్ ఛాంబర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం. దీంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు సామరస్యంగా పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# సరస్వతి అంత్య పుష్కరాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు.

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చక బృందం, ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు వేంనరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేష్ పాల్గొన్నారు.

# మళ్లీ తెరపైకి 'ఐ బొమ్మ' వివాదం

**మొదటిపేజీ తరువాయి**


అక్రమంగా విడుదల చేస్తున్నారంటూ ఫిలిం ఛాంబర్ ఆదివారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' పేర్లతో నడుస్తున్న వెబ్‌సైట్లు తాజాగా విడుదలైన పలు సినిమాలను ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్నాయని సినీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఫిలిం ఛాంబర్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గతంలో 'ఐ బొమ్మ' పేరుతో ప్రచారంలోకి వచ్చిన ఇమంది రవి ఈ వ్యవహారంపై స్పందించారు. ప్రస్తుతం నడుస్తున్న కొత్త 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన పేరును, 'ఐ బొమ్మ' బ్రాండ్‌ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల విడుదలైన పలు తెలుగు సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లలో దర్శనమివ్వడం సినీ పరిశ్రమలో ఆందోళన కలిగిస్తోంది. భారీ బడ్జెట్ సినిమాల కలెక్షన్లపై దీని ప్రభావం పడుతోందని నిర్మాతలు, దర్శకులు చెబుతున్నారు. 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్ల నిర్వాహకుల గుర్తింపుపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు. సర్వర్లు ఎక్కడి నుంచి నిర్వహిస్తున్నారు..? వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు..? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సినీ పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరుతోంది.

# ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు వర్క్ బుక్స్

**హైదరాబాద్:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 202627 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ప్రత్యేక వర్క్ బుక్స్ అందజేయాలని నిర్ణయించింది. జూన్ నెలాఖరు నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వీటిని పంపిణీ చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించిన వర్క్ బుక్స్‌ను సులభంగా అర్థమయ్యేలా కన్వర్జేషన్ విధానంలో రూపొందిస్తున్నారు. విద్యార్థులు పాఠాలు విన్న వెంటనే ప్రాక్టీస్ చేసే విధంగా మాడ్యూల్స్ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే వర్క్ బుక్స్ ముద్రణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. "నిరంతర సాధన ద్వారానే విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించగలరు" అన్న అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ వర్క్ బుక్స్ ఉపయోగపడనున్నాయి.

మొత్తం ముద్రించనున్న పుస్తకాల్లో దాదాపు 90 శాతం ఇంగ్లీష్ మీడియంలోనే ఉండనున్నాయి. దీనివల్ల విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు పెరగడంతో పాటు సబ్జెక్టులపై అవగాహన మరింత మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు.



# ప్రేమ వేధింపులతో యువతి హత్య

- **స్థానికుల దాడిలో నిందితుడి మృతి**
- **జడ్చర్లలో విషాద ఘటన**

**మహబూబ్‌నగర్, మే 17 :**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ప్రేమ వేధింపులు తీవ్ర విషాదానికి దారితీశాయి. ప్రేమను నిరాకరించిందన్న కక్షతో ఓ యువకుడు యువతిపై కత్తితో దాడి చేయగా ఆమె మృతి చెందింది. అనంతరం ఆగ్రహించిన స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడిన నిందితుడు కూడా చికిత్స పొందుతూ చనిపోయాడు. జడ్చర్ల నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి పోలేపల్లి ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఓ పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తోంది. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన తేజ ఆమెను అడ్డగట్టినట్లు సమాచారం. కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్న తేజ వెంట తెచ్చుకున్న కత్తితో యువతిపై దాడి చేసినట్లు తెలిసింది. తీవ్ర గాయాలతో వైష్ణవి అక్కడికక్కడే కుప్పకూలింది. ఈ ఘటనను చూసిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో తేజపై దాడి చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. తీవ్ర గాయాలతో ఉన్న తేజను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గత రెండేళ్లుగా తమ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల యువతికి వేరొకరితో నిశ్చితార్థం జరగడంతో కక్ష పెంచుకుని ఈ దాడికి పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు గల పూర్తి కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

పవర్ స్టేషన్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్‌లోని యూనిట్ 3 పరిధిలో టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు భయాందోళనలకు గురయ్యారు. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీకేజీ కారణంగానే ఈ మంటలు వ్యాపించినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీక్ కావడంతో మంటలు వేగంగా వ్యాపించి ప్లాంట్ ఆవరణ అంతటా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతకు పంప్ పరిధిలోని కంట్రోల్ కేబుల్స్, కొన్ని కీలక వాల్వ్‌లు పూర్తిగా కాలిపోయాయి. అయితే ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వ్యవస్థతో పాటు సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రధాన యంత్రాలకు భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. నష్టం తీవ్రతను అంచనా వేయడంతో పాటు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు అంతర్గత దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశారు.

# 20న మెడికల్ షాపుల బంద్

- **మద్దతు ప్రకటించాలని టీటీసీడీఏ పిలుపు**

**తెలంగాణ బ్యూరో:**

ఆన్‌లైన్ ఫార్మసీల అక్రమ విక్రయాలు, చైన్ ఫార్మసీల మితిమీరిన డిస్కౌంట్లకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్త ఫార్మసీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ (టిటిసిడిఏ) వెల్లడించింది. ఈ మేరకు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసిడి), డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ (డిసిఓఐడబ్ల్యూఏ) జాతీయ అధ్యక్షుడు జి. కోటేశ్వర రావుకు అసోసియేషన్ ప్రతినిధులు ఒక లేఖను అందజేశారు. ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

**చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకం...**

నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్‌లైన్ మందుల అమ్మకాలు, కార్పొరేట్ చైన్ ఫార్మసీలు ఇస్తున్న భారీ డిస్కౌంట్ల వల్ల సాధారణ రిటైల్, హోల్‌సేల్ కెమిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఫార్మా రంగంలో లాభాల మార్జిన్ చాలా పరిమితంగా ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ సంస్థలు ఇచ్చే డిస్కౌంట్లను తట్టుకుని దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది చిన్న, మధ్యతరహా వ్యాపారులు నిలదొక్కుకోవడం కష్టంగా మారిందని లేఖలో పేర్కొన్నారు.

**ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు...**

ఆర్థిక నష్టాలతో పాటు నియంత్రణ లేని ఆన్‌లైన్ విక్రయాల వల్ల ప్రజారోగ్యం, ముఖ్యంగా యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని అసోసియేషన్ హెచ్చరించింది. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఆన్‌లైన్‌లో మందులు లభిస్తుండటంతో యువత సెల్ఫ్ మెడికేషన్ (సొంత వైద్యం)కు అలవాటు పడుతున్నారని తెలిపింది. నాణ్యత లేని, నకిలీ మందులు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం పెరిగిందని వెల్లడించింది. మందుల దుర్వినియోగం, డ్రగ్ నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయని పేర్కొంది. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 20న చేపట్టే ఒక రోజు దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి. రాజు, కోశాధికారి పి. కృష్ణ కుమార్ పిలుపునిచ్చారు.

**అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు...**

- ఆన్‌లైన్, చైన్ ఫార్మసీల అనైతిక డిస్కౌంట్ విధానాలపై నియంత్రణ తీసుకురావాలి.
- చిన్న తరహా రిటైల్ వ్యాపారుల మనుగడను కాపాడేలా ట్రేడ్ మార్జిన్లను రక్షించాలి.
- ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నకిలీ, నాణ్యత లేని మందుల సరఫరాను అడ్డుకోవాలి.
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా జరిగే అక్రమ, అశాస్త్రీయ మందుల అమ్మకాలను పూర్తిగా నిరోధించాలి.

# 12వ తరగతి పేపర్ ఎవాల్యుయేషన్‌లో ఏఐ వాడారా? సీబీఎస్ఈ బోర్డు క్లారిటీ

- **'ఆన్-స్క్రీన్ మార్కింగ్' విధానంపై తీవ్ర విమర్శలు**
- **ఏఐ వాడలేదని బోర్డు వివరణ**
- **జవాబు పత్రాలను మాత్రమే డిజిటలైజ్ చేశామని వెల్లడి**
- **మే 19 నుంచి ప్రత్యేక సమీక్ష**

**హైదరాబాద్**

సీబీఎస్ఈ 12వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించలేదని బోర్డు స్పష్టం చేసింది. కొత్తగా ప్రవేశపెట్టిన 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' (ఓఎస్ఎమ్) విధానంపై విద్యార్థుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ సంజయ్ కుమార్ స్పందించారు.

అనేక విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఈ డిజిటల్ మూల్యాంకన విధానాన్ని అనుసరిస్తున్నాయని సంజయ్ గుర్తు చేశారు. ఈ సిస్టమ్‌లో ప్రతి సమాధానాన్ని ఉపాధ్యాయులే స్వయంగా స్క్రీన్‌పై చూస్తూ మార్కులు వేస్తారని వివరించారు. మూల్యాంకన విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. కేవలం డిజిటలైజేషన్ మాత్రమే చేశామని తెలిపారు.

ఈ ఏడాది దాదాపు 98 లక్షలకు పైగా జవాబు పత్రాలను ఈ విధానంలోనే పరిశీలించినట్లు బోర్డు వెల్లడించింది. అక్కడక్కడా కొన్ని తప్పులు దొర్లే అవకాశం ఉందని అంగీకరించింది. ప్రారంభంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటన్నింటినీ అధిగమించినట్లు తెలిపింది. విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం కోసం మే 19 నుంచి ప్రత్యేక సమీక్షా ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది.




స్కాన్ చేసిన జవాబు పత్రాల కాపీల కోసం విద్యార్థులు మే 19 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత మార్కుల వెరిఫికేషన్, రీఎవాల్యుయేషన్ కోసం మే 26 నుంచి మే 29 వరకు గడువు ఇచ్చారు. రీఎవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నుంచి రూ.100 ఫీజు వసూలు చేస్తారు. ఒకవేళ సమీక్ష తర్వాత విద్యార్థికి మార్కులు పెరిగితే ఆ మొత్తాన్ని సీబీఎస్ఈ రీఫండ్ చేస్తుంది.





# 'ఐక్య' సంస్థ ప్రారంభం వెనుక ఉద్దేశం ఇదే: మంచు మనోజ్, మౌనిక

- **'ఐక్య ధైర్య సేన సమితి'ని ప్రారంభించిన మంచు మనోజ్, మౌనిక**
- **సేవా భావం ఉన్నవారందరినీ ఒకే వేదికపైకి తేవడమే లక్ష్యమన్న మనోజ్**
- **మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై కూడా దృష్టి సారిస్తామన్న మౌనిక**
- **ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరించిన మనోజ్ దంపతులు**
- **కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**

**హైదరాబాద్**

సమాజానికి సేవ చేయాలనే బలమైన ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే గొప్ప లక్ష్యంతోనే ఐక్య సంస్థను ప్రారంభించినట్టు నటుడు 'రా కింగ్' మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక భూమా వెల్లడించారు. తన పుట్టినరోజు నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో "ఐక్య ధైర్య సేన సమితి" అనే తమ సామాజిక సేవా సంస్థను మనోజ్ అధికారికంగా ఆవిష్కరించారు. సేవా భావం ఉన్నవారందరికీ ఒక వేదికను అందించాలనేదే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమం గురించి మనోజ్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "సమాజానికి అండగా నిలబడటం నేను, నా భార్య మౌనిక మా పెద్దల నుంచి నేర్చుకున్నాం. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినా, ఒకే ఆలోచన ఉన్న వారందరి కోసం ఒక వేదిక ఉండాలనిపించింది. ఈ ఆలోచన నిజానికి నా భార్య మౌనికది. ఆమె స్ఫూర్తితోనే ఈ సంస్థను ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఎవరికి నిజమైన సహాయం అందినా అదే మాకు గొప్ప విజయం" అని తెలిపారు.

ఈ రోజు నుంచే ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరిస్తున్నామని, ఈ సేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ గ్రామానికి విస్తరిస్తామని ఆయన ప్రకటించారు.అనంతరం మౌనిక భూమా మంచు మాట్లాడుతూ, "మంచి ఉద్దేశంతో నేను, మనోజ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది మా తల్లిదండ్రుల ఆశీర్వాదాల వల్లే సాధ్యమైంది. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానంతో పాటు మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతాం. 'నమస్తే వరల్డ్' సంస్థ ద్వారా టాయ్ మేకింగ్ వంటి కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని వివరించారు.ముఖ్య అతిథిగా హాజరైన జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, "ఐక్య ధైర్య సేన సమితి" పేరును అధికారికంగా ప్రకటించారు. మనోజ్ కుటుంబంతో తమకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, చిన్నప్పటి నుంచే మనోజ్‌లో సేవా భావం ఉందని కొనియాడారు. మౌనిక ఆలోచనతో పుట్టినరోజున ఈ ట్రస్ట్ ప్రారంభించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకవైపు 'డేవిడ్ రెడ్డి' వంటి భారీ చిత్రాలతో నటుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు 'ఐక్య ధైర్య సేన సమితి' ద్వారా సమాజ సేవకు అంకితం కావడం పట్ల మనోజ్ దంపతులపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమాలు, సమాజ సేవ అనే రెండు మార్గాల్లో మనోజ్ తన ప్రయాణాన్ని బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు.



# మోదీజీ మౌనమెందుకు

## పరీక్ష రద్దయినా విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?

## నీట్ పేపర్ లీక్ కేసుపై మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, మే 17:** దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్ యూజీ 2026' ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఉదంతంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేపర్ లీక్ ఘటనపై ప్రధాని మోదీకి పలు సూటి ప్రశ్నలు సంధిస్తూ ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. దేశంలో పదేపదే ఇలాంటి తప్పులు జరుగుతున్నా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మోదీ మౌనం వహించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన 'ఎక్స్' పోస్ట్‌లో గత సంఘటనలను సైతం గుర్తుచేస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. "గతంలో నీట్ 2024 పేపర్ లీక్ అయింది. అప్పట్లో పరీక్ష రద్దు కాలేదు, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి కూడా రాజీనామా చేయలేదు. కేవలం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఘటనపై నిజానిజాలు తేల్చేందుకు కేంద్రం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు నీట్ 2026లోనూ అదే విధంగా పేపర్ లీక్ అయింది. ఈసారి పరీక్ష రద్దు అయింది. అయినా సరే, సంబంధిత కేంద్ర మంత్రి మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు. సీబీఐ మళ్లీ దర్యాప్తు చేస్తోంది.. దీనికోసం మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు" అంటూ విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంపై దేశం తరఫున ప్రధాని మోదీని ప్రశ్నిస్తున్నానంటూ రాహుల్ గాంధీ మూడు ముఖ్యమైన ప్రశ్నలను సంధించారు. దేశంలో ఇలాంటి ప్రతిష్టాత్మక పరీక్షల పేపర్ లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయని ఆయన అడిగారు. భవిష్యత్తును కోల్పోతున్న విద్యార్థుల ఆందోళనల నడుమ, ఈ పరీక్షా పత్రాల లీక్‌పై ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో, పేపర్ లీకులను అరికట్టడంలో పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదని నిలదీశారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని ఈ లీకేజీ వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తూతూమంత్రంగా కమిటీలు వేయడం కాకుండా తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ చేసిన ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారడమే కాకుండా నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఆవుల ధ్రువీకరణపై ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం

## బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ

## ఆవుల జనన ధ్రువీకరణ పత్రాలపై కొత్త వివాదం

## వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన టీఎంసీ

**కోల్‌కతా, మే 17:** పశువుల రవాణా అంశంపై పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆవుల జనన ధృవీకరణ పత్రాలు (బర్త్ సర్టిఫికెట్లు) చూపించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యే రేఖా పాత్ర చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలను అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తీవ్రంగా తప్పుబట్టింది. వివరాల్లోకి వెళ్తే.. హింగల్‌గంజ్ పరిధిలోని లెబుఖాలి ప్రాంతంలో పశువులను తరలిస్తున్న ఒక వాహనాన్ని ఎమ్మెల్యే రేఖా పాత్ర అడ్డుకున్నారు. వాహనంలోని పశువులను కిందకు దించి రోడ్డు పక్కన చెట్టుకు కట్టించి వాటికి గడ్డి, నీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమ పశు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తమ పార్టీ నాయకత్వం ఆదేశించిందని రేఖా పాత్ర తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే 14 ఏళ్లలోపు ఉన్న పశువులను వధించకూడదనే నిబంధనలు అమలులో ఉన్నాయని ఆమె వివరించారు. ఎవరైనా పశువులను రవాణా చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అడుగుతామని, ఈ క్రమంలో ఆవుల జనన ధ్రువీకరణ పత్రాలు చూపించాలని కోరుతామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఆవులకు జారీ చేసిన జనన ధృవీకరణ పత్రాలను చూపించగలరా అని టీఎంసీ నేతలు ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఇప్పుడు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. పశువుల రవాణా, అక్రమ వ్యాపారం, చట్టాల అమలు అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి.





# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

## భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి

## మరో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటన

## భారత రాయబార కార్యాలయం స్పందన



**మాస్కో, మే 17:** రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు పాల్పడిన ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో భారతీయ కార్మికుడితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరో ముగ్గురు భారతీయ కార్మికులతో పాటు పలువురు గాయపడినట్లు రష్యాలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. దాడి జరిగిన ప్రాంతాన్ని భారత రాయబార కార్యాలయ అధికారులు సందర్శించినట్లు సమాచారం. గాయపడిన భారతీయ కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు స్థానిక అధికారులు, సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిపట్ల భారత రాయబార కార్యాలయం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. గాయపడిన వారికి వైద్య సహాయం, ఇతర అవసరాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. భారతీయ కార్మికుల భద్రతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా ఆదివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టినట్లు రష్యా అధికారులు తెలిపారు. మాస్కో రాజధానితో పాటు పలు సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు వెల్లడించారు. ఈ దాడులు దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించినట్లు సమాచారం. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాజధాని మాస్కో వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల కారణంగా పలు నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మాస్కో ప్రాంతంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో కూడా నష్టం సంభవించినట్లు సమాచారం. రష్యా--ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కండ్లా చేరిన ఎల్‌పీజీ ట్యాంకర్ సైమీ

## హర్మూజ్ జలసంధిని దాటి భారత్‌కు చేరిక

## ఇంధనంతో సురక్షిత ప్రయాణం

## ఉద్రిక్తతలతో సరఫరాపై ఆందోళనలు

**గుజరాత్, మే 17:** ఎల్‌పీజీ లోడ్‌తో ప్రయాణించిన 'సైమీ' ట్యాంకర్ సురక్షితంగా గుజరాత్‌లోని కండ్లా పోర్టుకు చేరుకుంది. మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణించిన ఈ నౌక దాదాపు 20 వేల టన్నుల ఇంధనాన్ని తీసుకొచ్చింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ ప్రయాణం ప్రాధాన్యం సంతరించుకుంది. మే 13న హర్మూజ్ జలసంధిని దాటిన ఈ నౌక 4 రోజుల ప్రయాణం అనంతరం భారత్‌కు చేరుకుంది. నౌకలో మొత్తం 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది ఉక్రెయిన్ పౌరులు కాగా, మరో 13 మంది ఫిలిప్పీన్స్‌కు చెందినవారు ఉన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటిన 11వ ఎల్‌పీజీ ట్యాంకర్‌గా 'సైమీ' నిలిచింది. దీంతో భారత్‌కు ఇంధన సరఫరాలో ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు. షిప్పింగ్, విదేశాంగ, రక్షణ, చమురు శాఖల మధ్య సమన్వయంతో ఈ ట్యాంకర్ సురక్షితంగా భారత తీరానికి చేరుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఇంధన సరఫరాపై పెరుగుతున్న ఒత్తిళ్ల మధ్య ఈ ప్రయాణం విజయవంతం కావడం కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. హర్మూజ్ జలసంధిలో గత 75 రోజులుగా కొనసాగుతున్న అంతరాయాల ప్రభావం భారత్‌పై కూడా పడుతోంది. ఈ కారణంగా దేశ ముడిచమురు నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. కొన్ని నెలల వ్యవధిలోనే చమురు నిల్వలు దాదాపు 15 శాతం మేర తగ్గినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. అయితే దిగుమతులు తగ్గినప్పటికీ భారతీయ రిఫైనరీలు ప్రస్తుతం తమ కార్యకలాపాలను యథాతథంగా కొనసాగిస్తున్నాయి. ప్రాసెసింగ్‌లో ఇప్పటివరకు ఎలాంటి కోతలు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ, సరఫరాలో అంతరాయాలు కొనసాగితే భవిష్యత్తులో నిర్వహణ భారంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





# గంగ ఒప్పందంపై బంగ్లాదేశ్ షరతులు

## భారత్‌తో సంబంధాలపై కొత్త వ్యాఖ్యలు

## నీటి పంపకాలపై చర్చలకు డిమాండ్

## పద్మా ప్రాజెక్టుతో మరో వివాదం

**ఢాకా, మే 17:** గంగానది జలాల పంపకాల ఒప్పందం అంశం భారత్–బంగ్లాదేశ్ సంబంధాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో భారత్‌తో కొనసాగే సంబంధాలు గంగానది నీటి పంపకాలపై కుదిరే కొత్త ఒప్పందంపైనే ఆధారపడి ఉంటాయని బంగ్లాదేశ్ అధికార వర్గాలు తాజాగా వ్యాఖ్యానించాయి. దీంతో రెండు దేశాల మధ్య జలాల అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. తమ దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త నీటి ఒప్పందం అవసరమని పేర్కొంటూ, ఈ అంశంపై భారత్‌తో త్వరగా చర్చలు ప్రారంభించాలని కోరింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందంలో మార్పులు అవసరమని పార్టీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఇండో--బంగ్లాదేశ్ గంగానది నీటి పంపకాల ఒప్పందం 1996లో కుదిరింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయితే ఈ ఏడాది డిసెంబర్‌తో దాని గడువు ముగియనుండటంతో కొత్త ఒప్పందంపై ఆసక్తి పెరుగుతోంది. బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ మాట్లాడుతూ, కొత్త ఒప్పందం కుదిరే వరకు ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లనే కొనసాగించాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో కుదిరే జల ఒప్పందాలకు కాలపరిమితి ఉండకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. దీని వల్ల దీర్ఘకాలిక స్థిరత్వం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గంగానదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. ఆ దేశ వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థ, తాగునీటి అవసరాలకు ఈ నది ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. అక్కడి జనాభాలో దాదాపు మూడో వంతు ప్రజలు జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారని అక్కడి వర్గాలు చెబుతున్నాయి. ఫరక్కా బ్యారేజ్ కారణంగా ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గుతోందని బంగ్లాదేశ్ ఆరోపిస్తోంది. దీనివల్ల ఉప్పునీటి ప్రభావం పెరిగి పంటలు దెబ్బతింటున్నాయని చెబుతోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించామని భారత్ చెబుతోంది. ఇదే సమయంలో పద్మా నదిపై భారీ బ్యారేజ్ ప్రాజెక్టుకు బంగ్లాదేశ్ ఆమోదం తెలపడం ఇప్పుడు మరో కొత్త వివాదానికి కారణమవుతోంది.

# స్వీడన్‌లో మోడీకి ఘన స్వాగతం

**న్యూఢిల్లీ, మే17:** ప్రధాని నరేంద్రమోడీ తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం స్వీడన్ చేరుకున్నారు. నెదర్లాండ్స్ పర్యటన ముగిసిన అనంతరం ఆయన స్వీడన్‌కు వెళ్లారు. అక్కడ ప్రధాని మోడీకి స్వీడన్ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ప్రధాని విమానం స్వీడన్ గగనతలంలోకి ప్రవేశించగానే స్వీడిష్ గ్రిపెన్ ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా నిలిచాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ మే 17, 18 తేదీల్లో గోథెన్‌బర్గ్‌లో పర్యటించనున్నారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వీడన్ ప్రధాని స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి మోడీకి స్వాగతం పలికారు. మరోవైపు ప్రధాని మోడీకి స్వాగతం పలికేందుకు ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ పర్యటనలో స్వీడన్ వ్యాపారవేత్తలతో ప్రధాని సమావేశం కానున్నారు. అలాగే స్వీడన్ ప్రధాని క్రిస్టర్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. రెండు దేశాల మధ్య పలు రంగాల్లో కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సుప్రీం జడ్జీల సంఖ్య పెంపు

## 34 నుంచి 38కి పెరగనున్న సంఖ్య

## సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, మే 17:** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను పెంచేందుకు రూపొందించిన సవరణ చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న జడ్జీల సంఖ్య 34 నుంచి 38కు పెరగనుంది. సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య సవరణ చట్టం–2026కు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. జడ్జీల సంఖ్య పెంపునకు సంబంధించిన ప్రతిపాదనకు ఈ నెల 5న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. అనంతరం దీనిని రాష్ట్రపతికి పంపగా, ఆమె అధికారికంగా ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకంగా మారింది. కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంలో అదనపు జడ్జీల నియామకం సహాయపడుతుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు న్యాయవాదులు, న్యాయమూర్తులు స్వాగతిస్తున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మాట్లాడుతూ, జడ్జీల సంఖ్య పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశమని తెలిపారు. అయితే సంఖ్య పెంపుతో పాటు మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరమని సూచించారు. సుప్రీంకోర్టు కొత్త భవనం నిర్మాణం ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది జడ్జీలు పనిచేసేలా సదుపాయాలు కూడా ఏర్పాటు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

# రోడ్డుపై సోలార్ విద్యుత్ స్తంభం



- ప్రమాదాలకు నిలయంగా మారిన యాదగిరిగుట్ట సర్వీస్ రోడ్...
- వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారుల విజ్ఞప్తి...

**యాదాద్రి భువనగిరి మే 17 (రాజముద్ర):**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై రాయగిరి మెయిన్ రోడ్ నుంచి యాదగిరిగుట్ట సర్వీస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టర్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై సోలార్ విద్యుత్ స్తంభం గత మూడు నాలుగు రోజులుగా అలాగే ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఈ స్తంభం స్పష్టంగా కనిపించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనాలు ఒక్కసారిగా రోడ్డుమధ్యలో ఉన్న స్తంభాన్ని గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలువురు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పడివున్న సోలార్ విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, వాహనదారుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు. ప్రమాదం జరిగాక స్పందించకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





## యండమూరి లేఔట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**కుత్బుల్లాపూర్, రాజ ముద్ర న్యూస్ :** మహదేవపురం డివిజన్ ఎండమూరి లేఔట్‌లో నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా గీద సుమన్ రెడ్డి, చైర్మన్‌గా వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్లేశం, కోశాధికారులుగా అకెళ్ళ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా రవి, సజన్‌ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా శివానంద్ మాడపాటి, వీరబాబు, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చందు, రమేష్ రెడ్డి, అప్పారావు, కృష్ణ యాదవ్ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గోవింద్, భీమా రెడ్డి, కంచి రవి, శ్రీకాంత్ రెడ్డి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్ల సమస్యలను త్వరితగతిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అలాగే మా నూతన కార్యవర్గ ఎన్నిక సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, పెద్దలు, మాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా డీసీఎంఎస్ మోహన్ కృష్ణ, డీసీఓ నాగార్జున

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైస్ మిల్లులు, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ,డి సి ఓ నాగార్జున తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీ వెంకట సాయి రైస్ మిల్ పరిగి, దుర్గా భవాని రైస్ మిల్ బురాన్ పూర్ గ్రామం, బొంరాస్ పేట్, శ్రీ సాయి ఇండస్ట్రీస్ గౌరారం,శ్రీ వెంకటేశ్వర బాయిల్డ్ రైస్ మిల్లు కొడంగల్, వరి కొనుగోలు కేంద్రం దౌల్తాబాద్,వివిధ రైస్ మిల్లులు, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఎక్కువ మంది హమాలిలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా మిలర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ధాన్యం రవాణా, హమాలి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. ప్రతి మిల్లు దగ్గర పోలీస్ అధికారులతో పాటు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండ పోలీస్ అధికారుల సహకారముంటుందని తెలిపారు.ఆయా కేంద్రాల్లో బస్తాల కొరత లేకుండా, వాహనాలు ఏర్పాటు చేసుకొని, హమాలీ లతో అన్లో డింగ్ పూర్తి చేయాలనీ సూచించారు. ఈ పర్యటనలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మోహన్ కృష్ణ,సుదర్శన్, , డి టి లు, పోలీస్ అధికారులు ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి



- ఏఎంసి చైర్మన్ వెన్నపూసల సీతారాములు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

విద్యార్థులు లక్ష్య సాధన కోసం ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు.స్థానిక మండల వనరుల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ విద్యా దినోత్సవాలు ముగింపు విజయోత్సవాలకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు చిటించెట్టి మహేష్,పి.ఉషశ్రీ,కే.జెస్సికాను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్ లోనూ

మొదటి స్థానాల్లో నిలవాలని,తద్వారా తల్లితండ్రులకు,గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.చలపతిరావు,ఆయా పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ఉ పాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## టాపర్‌కు ప్రోత్సాహం

**అశ్వారావుపేట, మే 17 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మామిళ్ళవారిగూడెం పాఠశాలకు చెందిన పదో తరగతి టాపర్ విద్యార్థి మద్దాల ప్రవీణ్‌కు రూ.10 వేల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా చెక్కు అందుకోవడం పాఠశాలకు గర్వకారణంగా మారింది.

చదువులో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రవీణ్‌ను అధికారులు అభినందించారు. కష్టపడి చదివి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో ముందుకు సాగితే గొప్ప విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలి
- టి డబ్ల్యూ జె ఎఫ్ వికారాబాద్ జిల్లా మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**



జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏండ్ల తరబడి సమస్యలు పెండింగ్ లో ఉండటంతో జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని గుర్తుచేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా అక్రెడిటేషన్ లు లేక అష్టకష్టాలు పడ్డారని అభిప్రయపడ్డారు. ఎట్టకేలకు అక్రిడిటేషన్ లు, ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాల్లో రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియలో జర్నలిస్ట్ సంఘాల అభిప్రాయం తీసుకోకపోవడం పై నిరసన తెలిపారు. హైదరాబాద్ తో పాటు జిల్లా కేంద్రాలో మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతోందనీ, వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని చేసే చోట నుంచి ఇంటివరకు రాత్రి పూట రవాణా వసతిని ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రవేశపెడుతున్న నూతన హెల్త్ కార్డుల పథకాన్నీ జర్నలిస్టులకూ వర్తింపచేయాలని కోరారు. సంక్షేమ పథకాలను వీలైనంత తొందరగా అమల్లోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఈ మహాసభకు సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ షఫీ అధ్యక్షత వహించగా భారీ సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ మహాసభలో సీనియర్ జర్నలిస్టులు ఎం రవీందర్, సంజీవ, రాంచందర్, వెంకట్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

1. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డుల మంజూరు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలి
2. మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.
3. ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియలో జ ర్నలిస్టు సంఘాల అభిప్రాయం తీసుకోవాలి
4. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను మరింత చురుగ్గా అమలు చేయాలి. శిక్షణా కార్యక్రమాలను పెంచాలి
5. వికారాబాద్ లోని జర్నలిస్టులకు స్థానికంగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలి.

**నూతన ఎన్నికైన కమిటీ**

టిడబ్ల్యూజేఎఫ్ వికారాబాద్ జిల్లా నూతన కమిటీ 34 మంది జర్నలిస్టులతో ఎన్నికైంది. అధ్యక్షులుగా టి. రాంచందర్, కార్యదర్శి గా ఎం డీ షఫీ, ఉపాధ్యక్షులుగా ఎ.ఆనంద్, మురళి గుప్తా, కె. కృష్ణ గౌడ్ ,సి. శ్రీనివాస్, కె.పాండు, హఫీజ్, బీమాషాప్ప, సహాయ కార్యదర్శులుగా జి.మాణిక్యం, వెంకట్, బసవరాజ్, కృష్ణ, అనిల్, రాజు, మద్దులపల్లి అనిల్ కుమార్, కోశాధికారిగా బి.ప్రశాంత్ కుమార్ , క్రిడల కార్యదర్శిగా వెంకట్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, చంద్రశేఖర్, ఎన్. కుమార్, అజీజ్ అలీ, ఉదయ్, మహేందర్, ఏజాజ్, జగన్, అరుణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా ఎం రవీందర్, బి సంజీవ్, వెంకట్ రాంరెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా మాసాని వెంకటయ్య తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కమిటీ కి సన్మానం చేశారు.

## ఘనంగా ప్రారంభమైన జింకలగూడెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

**క్రికెట్ క్రీడలను ప్రారంభించిన ఎస్ఐ కూచిపూడి జగదీష్**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

తిరుమలాయపాలెం మండలం లోని జింకలగూడెంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో రెండు నియోజకవర్గ స్థాయిలో డోర్నకల్ మరియు పాలేరు నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న ఈ టోర్నీకి యువకులు, క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ మరియు మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీనివాస్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆటగాళ్లతో కలిసి పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కూచిపూడి జగదీష్ మాట్లాడుతూ.. "క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. గ్రామీణ స్థాయిలో నిర్వహించే ఇలాంటి టోర్నీలు ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువస్తాయి. ప్రస్తుతం డోర్నకల్, పాలేరు నియోజకవర్గ స్థాయి లో యువత క్రీడలపై చూపుతున్న ఆసక్తి అభినందనీయం. ఈ జింకలగూడెం ప్రీమియర్ లీగ్ కూడా భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయికి ఎదగాలి" అని ఆకాంక్షించారు. అలాగే యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను అలవాటు చేసుకోవాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న ఈ టోర్నీ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, డోర్నకల్ – పాలేరు నియోజకవర్గాల క్రీడాకారులకు పరస్పర పరి చయ వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూచిపూడి జగదీష్ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీనివాస్, గ్రేటర్ ఇన్నా చైర్మన్ సయ్యద్ ఇమామ్, గోల్తం డా సర్పంచ్ బానోత్ సుజాత అనిల్ కుమార్, భాగ్యలక్ష్మి కాటన్ మిల్ రేపూరి వెంకన్న, శ్రీ శ్రీనివాస రైస్ మిల్ ఇండస్ట్రీ పుసులూరి జయమ్మ, గ్రామ పెద్దలు షేక్ కరీం, సయ్యద్ సిలార్, మదర్, ఫయాజ్, షేక్ జబ్బార్, షేక్ నా గుల్ మీరా, బానోత్ ప్రసాద్, బానోత్ రమేష్, షేక్ నజీర్ మరియు జింకల గూడెం ప్రీమియర్ లీగ్ మేనేజ్మెంట్ స భ్యు లు గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు

## శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:**

శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానం గ్రామం ఇస్సన్నపల్లి (రామారెడ్డి) మండలం రామారెడ్డి జిల్లా కామారెడ్డి దేవస్థానంలో శ్రీ శ్రీ శ్రీ యతి వర మాధవనంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో జిల్లాలోని బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీ సూక్త మహా రుద్ర పారాయణములు భక్తులచే లక్ష పుష్పార్చన కార్యక్రమం, వేద పఠనం స్వామివారికి అభిషేకం తదుపరి భక్తులకు బ్రాహ్మణులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడినది ఈ యొక్క కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి బి ప్రభు అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతల శంకర్, సభ్యులు, దేవస్థాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ,వంశీ శర్మ ,జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ , ఆఫీస్ సబార్డినేట్ నాగరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## హిందూ సమ్మేళనంతో కాషాయమయమైన సత్తుపల్లి

**సత్తుపల్లి, మే 17 :** సత్తుపల్లి పట్టణం హిందూ సమ్మేళనంతో భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. వేలాదిగా తరలివచ్చిన హిందూ బంధువులతో పట్టణ వీధులు జనసంద్రమయ్యాయి. జై శ్రీరామ్... జై జై శ్రీరామ్ నినాదాలతో సత్తుపల్లి మారుమోగిపోయింది. వేలాది బైక్‌లతో నిర్వహించిన భారీ శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కాషాయ జెండాలు, శ్రీరాముడి చిత్రపటాలతో యువత భారీగా పాల్గొని పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.

# పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సహకారం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్**

రామారెడ్డి మండలం వేసవి సెలవుల్లో భాగంగా పాఠశాలల్లో మూడు రోజుల క్రితం జరిగిన పాఠశాల అభివృద్ధి కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ యుపిఎస్ కన్నాపూర్ పాఠశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ సమావేశం లో యుపిఎస్ కన్నాపూర్ పాఠశాల కు రంగులు వేయించమని గ్రామ ప్రజలను కోరడం జరిగింది. ఇట్టి విషయంపై స్పందించి :ఈ పాఠశాలల్లో 2006 -2007లో 7th క్లాస్ చదివినటువంటి పూర్వ విద్యార్థుల ముందుకు వచ్చి మూడు భవనాలకు రంగులు వేయించడం జరిగింది. పూర్వ విద్యార్థులు, ,సర్పంచ్ గొల్ల మహేష్ యాదవ్ , కోటక్ మహేంద్ర బ్యాంక్ మేనేజర్ సిహెచ్ రణధీర్ రెడ్డి, సాఫ్ట్వేర్ ఇంజనీర్ సిహెచ్ విక్రమ్ రెడ్డి ,వార్డ్ సభ్యుడు పి హరీష్ ,పంచాయతీ కార్యదర్శి ఎస్ రమేష్, బస్వాపురం జువెలరీ క్యాషియర్ ఎస్ రాజేష్ , ఎం సంతోష్ , ట్రాక్టర్ యూనియన్ మాజీ వైస్ అధ్యక్షుడు డి. రాజశేఖర్ ,హెచ్. డి. బి .బ్యాంక్ సహాయకులు సిహెచ్ గంగారాజ,హార్వెస్టర్ డ్రైవర్ కే బాలకృష్ణ ,జీవదన్ హాస్పిటల్ సెక్రటరీ ప్రెసిడెంట్ పి .అనిల్, పెయింటింగ్ కే నవీన్, ట్రాక్టర్ యూనియన్ క్యాషియర్ సి.హెచ్ .రమేష్, కే భాస్కర్ , టి నవీన్, నరేష్ , ముందుకు వచ్చి ,సహాయం చేయడం జరిగింది వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అశోక్ ,తేజస్కర్ ,కాశీం పాఠశాల తరపున ధన్యవాదాలు తెలుపడం జరిగింది .ఇదే సహాయాన్ని మునుముందు కొనసాగించి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని వారిని కోరడం జరిగింది పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఉపాధ్యాయులకు వారు హామీ ఇవ్వడం జరిగింది

## 15వ అంతస్తు పైనుంచి దూకి బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

**కూకట్‌పల్లి, మే 17:**

మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒక విషాదె ఘటన చోటుచేసుకుంది. ఓ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అపార్ట్‌మెంట్ 15వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం కాశ్మీరి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పుష్ప కుమార్ టిక్కూ (66), తన కుటుంబంతో కలిసి మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్, టవర్-2లోని ఫ్లాట్ నంబర్ 1502లో నివసిస్తున్నారు. గత ఆరేళ్లుగా ఆయన తీవ్రమైన మెదడు నరాల సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆయన, ఆదివారం తెల్లవారుజామున సుమారు 3:55 గంటల ప్రాంతంలో తన ఫ్లాట్ ఉన్న 15వ అంతస్తు నుండి కిందకు దూకారు. తీవ్ర గాయాలవ్వడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



# నాలుకపై కనిపించే రంగు, మచ్చలను బట్టి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో ఇలా చెప్పవచ్చు

మన శరీరంలో ఏదైనా సమస్య ప్రారంభమైతే ముందుగా కొన్ని చిన్న సంకేతాల రూపంలో కనిపిస్తుంది. ఇలా సంకేతాలను చూపించే వాటిలో నాలుక కూడా ఒక ముఖ్యమైన సూచికగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాలుక రంగు, పైపొర, ఆకారం, మచ్చలు వంటి మార్పులు శరీర ఆరోగ్య పరిస్థితిపై సంకేతాలు ఇవ్వగలవని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా నిర్లక్ష్యం చేసే ఈ మార్పులు కొన్నిసార్లు పోషకాహార లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సూచన కావచ్చని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన నాలుక సాధారణంగా లేత గులాబీ రంగులో ఉంటుంది. ఇది సరైన పోషకాహారం, తగినంత నీరు తీసుకోవడం, మంచి నోటి పరిశుభ్రతను సూచిస్తుంది. పలుచని తెల్లటి పొర ఉండటం సహజమని నిపుణులు చెబుతున్నారు.

### ఐరన్, విటమిన్ బి12 లోపం ఉంటే..


నాలుక చాలా పలుచగా లేదా తెల్లగా కనిపిస్తే అది ఐరన్ లోపం, విటమిన్ బి12 కొరత లేదా రక్తహీనతకు సంకేతం కావచ్చు. కొన్నిసార్లు దీర్ఘకాలిక అలసట లేదా శరీరంలో శక్తి లోపాన్ని కూడా ఇది సూచిస్తుందని చెబుతున్నారు. నాలుకపై మందమైన తెల్లని పొర కనిపిస్తే అది నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడం, డీహైడ్రేషన్, ధూమపానం వంటి కారణాలతో అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాగే ఫంగల్ ఇన్ఫెక్షన్, ఐరన్ లేదా విటమిన్ బి12 లోపం వంటి సమస్యలకు కూడా ఇది సంకేతం కావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. నాలుకపై పసుపు రంగు పొర కనిపించడం సాధారణంగా మృత కణాలు, బ్యాక్టీరియా లేదా ఆహార అవశేషాలు పేరుకుపోవడం వల్ల జరుగుతుంది. ఇది ఎక్కువగా తాత్కాలికమే అయినప్పటికీ, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు లేదా జాండిస్ వంటి సమస్యలకు కూడా సూచనగా భావించాలి.

### నాలుక గాఢ ఎరుపు రంగులో ఉంటే..

అలాగే నాలుక గాఢ ఎరుపు లేదా స్ట్రాబెర్రీ రంగులో కనిపిస్తే అది విటమిన్ బి12 లోపం లేదా వాపుకు సంకేతం అవుతుంది. కొన్ని ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా స్కార్లెట్ ఫీవర్, కవాసాకి వ్యాధి వంటి సమస్యల్లో కూడా ఇలా కనిపించే అవకాశం ఉందని చెబుతున్నారు. కొంతమందిలో నాలుకపై మ్యాప్‌లా కనిపించే ఎర్రని మచ్చలు ఉంటాయి. దీనిని జియోగ్రాఫిక్ టంగ్ అని అంటారు. ఇది సాధారణంగా హానికరం కాదు, అంటువ్యాధి కూడా కాదు. అయితే ఒత్తిడి, విటమిన్ లోపాలు లేదా సోరియాసిస్ వంటి సమస్యలతో ఇది సంబంధం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిపుణుల సూచనల ప్రకారం, నాలుకలో అసాధారణ మార్పులు కొన్ని రోజులకు మించి కొనసాగితే వైద్యులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. సరైన నోటి పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా నాలుక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# భోజనం చేసిన తరువాత నిద్ర మత్తుగా ఎందుకు అనిపిస్తుంది..

భోజనం చేసిన తర్వాత నిద్రగా అనిపించడం లేదా శరీరంలో అలసట రావడం చాలా మందికి సాధారణంగా కనిపించే సమస్య. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నప్పటికీ కొందరికి భోజనం అనంతరం బద్ధకం, నిద్రమత్తు, శక్తి తగ్గిన భావన కలుగుతుంది. అయితే ఇది కేవలం ఆహారం వల్ల మాత్రమే కాకుండా, భోజనం తర్వాత శరీరంలో సహజంగా జరిగే మార్పుల కారణంగా కూడా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత శరీరం రెస్ట్ అండ్ డైజెస్ట్ మోడ్‌లోకి వెళు ుంది. అంటే ఆహారం జీర్ణం కావడానికి జీర్ణాశయం, పేగుల వైపు రక్తప్రసరణ ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రక్రియ వల్ల శరీరం కొంత ప్రశాంతంగా, రిలాక్స్ అయినట్లుగా అనిపిస్తుంది. దాంతో కొందరికి నిద్ర మత్తు కూడా వస్తుంది. దీన్ని చాలాసార్లు సహజమైన ప్రతిస్పందనగా భావిస్తారు.



### ఇలా చేయవద్దు..

అయితే మనం తీసుకునే ఆహారం కూడా ఈ అలసటపై ప్రభావం చూపుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో భోజనం చేయడం లేదా రిఫైన్డ్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. తెల్ల బియ్యం, వైట్ బ్రెడ్, అధిక చక్కెరలు ఉన్న పదార్థాలు, ఎక్కువగా ప్రాసెస్ చేసిన స్నాక్స్ వంటి ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచుతాయి. అనంతరం అవి వేగంగా తగ్గిపోవడంతో శరీరంలో అలసట, నిద్రమత్తు పెరిగే అవకాశం ఉంటుంది.

### వీటిని తీసుకోవాలి..

కనుక వీటికి భిన్నంగా ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన సమతుల ఆహారం తీసుకుంటే జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండి శక్తి కూడా ఎక్కువసేపు నిల్వ ఉంటుంది. ఆహారం తీసుకున్న వెంటనే శరీరంలో జరిగే ఈ మార్పులు సహజమైనవే అయినప్పటికీ, సరైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా భోజనం తర్వాత వచ్చే అలసటను కొంతవరకు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వాయు కాలుష్యంతో దీర్ఘకాలం పాటు మైగ్రేన్ తలనొప్పులు.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..

వాయు కాలుష్యం కేవలం శ్వాసకోశ సమస్యలకే కాదు, తీవ్రమైన తలనొప్పులైన మైగ్రేన్‌లకు కూడా కారణమవుతుందనే విషయాన్ని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా కాలుష్య స్థాయిలు పెరిగే రోజుల్లో మైగ్రేన్ ఎక్కువయ్యే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, తేమ వంటి అంశాలు కూడా ఈ ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయని అధ్యయనం సూచిస్తోంది. ఈ పరిశోధనలో మైగ్రేన్ సమస్యతో బాధపడుతున్న 7 వేల మందికి పైగా వ్యక్తులను సుమారు 10 సంవత్సరాల పాటు పరిశీలించారు. వీరు నివసించే ప్రాంతాల్లో ట్రాఫిక్, పరిశ్రమలు, ధూళి తుఫాన్ల వల్ల ఏర్పడే వాయు కాలుష్య స్థాయిలు, అలాగే వాతావరణ పరిస్థితులను విశ్లేషించారు.



### కాలుష్యం స్థాయిలు అధికంగా ఉంటే..

పరిశోధనలో పాల్గొన్నవారు ఎప్పుడు ఆసుపత్రులు లేదా క్లినిక్‌లను మైగ్రేన్ చికిత్స కోసం సందర్శించారో నమోదు చేసి, ఆ రోజుల్లో ఉన్న కాలుష్య స్థాయిలతో పోల్చారు. కాలుష్య ప్రభావం శరీరంపై కొన్ని రోజుల తరువాత కూడా కనిపించవచ్చని భావించి, సంఘటనకు ముందు ఏడురోజుల డేటాను కూడా పరిశీలించారు. అధ్యయన కాలంలో ఆసుపత్రి సందర్శనలు అత్యధికంగా నమోదైన రోజుల్లో గాల్లో ఉన్న పీఎం10 స్థాయిలు సగటుతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నాయని గుర్తించారు. సాధారణంగా 57.9 మైక్రాన్‌లు ప్రతి క్యూబిక్ మీటరుకు ఉండగా, అత్యధిక మైగ్రేన్ కేసులు నమోదైన రోజుల్లో ఇది 119.9 మైక్రాన్‌లకు చేరింది. అదేవిధంగా సూక్ష్మ కాలుష్య కణాలైన పీఎం 2.5 స్థాయిలు కూడా ఎక్కువగా నమోదయ్యాయి. ఈ కణాలకు దీర్ఘకాలంగా గురైన వ్యక్తులు మైగ్రేన్ మందులను ఎక్కువగా వినియోగించే అవకాశం 9 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. ట్రాఫిక్ కాలుష్యంతో విడుదలయ్యే నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌వో2) స్థాయిలు కూడా మైగ్రేన్ తీవ్రతతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎన్‌వో2 స్థాయిలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించే వారు మైగ్రేన్ మందుల వినియోగంలో 10 శాతం ఎక్కువ అవకాశాన్ని చూపించారు.

### కాలుష్యం తగ్గితే..

అత్యల్ప ఆసుపత్రి సందర్శనలు నమోదైన రోజుల్లో గాలి కాలుష్యం కూడా తక్కువగానే ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. ఇది వాయు కాలుష్యం, మైగ్రేన్‌ల మధ్య ఉన్న సంబంధాన్ని మరింత బలపరుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ పరిస్థితులు కూడా కాలుష్య ప్రభావాన్ని పెంచుతున్నాయని అధ్యయనం తెలిపింది. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ తేమ ఉన్న సమయంలో చీూ2 ప్రభావం ఎక్కువగా ఉండగా, చల్లని, అధిక తేమ ఉన్న పరిస్థితుల్లో పీఎం2.5 ప్రభావం తీవ్రమవుతుందని గుర్తించారు. వాతావరణ మార్పుల కారణంగా వేడి తరంగాలు, ధూళి తుఫాన్లు, కాలుష్య ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో మైగ్రేన్ బాధితులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అధిక కాలుష్యం ఉన్న రోజుల్లో బయట తిరగడం తగ్గించడం, ఇంట్లో గాలి శుద్ధి పరికరాలు ఉపయోగించడం, మైగ్రేన్ లక్షణాలు కనిపించిన వెంటనే మందులు ప్రారంభించడం వంటి చర్యలు ఉపశమనానికి దోహదపడతాయని సూచిస్తున్నారు.



# సజీవంగా ఢిల్లీ ఆశలు!

## రాజస్థాన్ రాయల్స్ పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం

## పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోయిన రాజస్థాన్



**ఐపీఎల్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్ పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో ఢిల్లీ తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోగా.. ఓటమి పాలైన రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను అత్యంత సంక్లిష్టం చేసుకుంది.**

**న్యూఢిల్లీ:** అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆదివారం 2026 మే 17 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఆ జట్టు 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది.

### పోరాడిన జురెల్, పరాగ్..

తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ బ్యాటర్లలో ధ్రువ్ జురెల్ 40 బంతుల్లో 53 పరుగులు, రియాన్ పరాగ్ 26 బంతుల్లో 51 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించారు. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సైతం దూకుడుగా ఆడి కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి సత్తా చాటాడు. ఢిల్లీ బౌలర్లలో స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డివిరిచాడు. లుంగి ఎంగిడి 4 ఓవర్లలో 24 పరుగులిచ్చి 2 వికెట్లు, మాధవ్ తివారీ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 2 వికెట్లు తమ ఖాతాలో వేసుకుని రాజస్థాన్ స్కోరును కట్టడి చేశారు.

### రాహుల్, పోరెల్ జోరు..

194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్లు శుభారంభం అందించారు. కే ఎల్ రాహుల్ 42 బంతుల్లో 56 పరుగులు చేయగా, అభిషేక్ పోరెల్ 31 బంతుల్లో 51 పరుగులు చేసి విజయానికి బాటలు వేశారు. ఆఖర్లో అక్షర్ పటేల్ కేవలం 18 బంతుల్లో అజేయంగా 34 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. దీంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఢిల్లీ సునాయాసంగా గెలుపొందింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు, బ్రిజేష్ శర్మ 4 ఓవర్లలో 44 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. దసున్ షనక 3 ఓవర్లలో 29 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు.

### సంక్లిష్టంగా రాజస్థాన్ అవకాశాలు..

ఈ అద్భుత విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన ఢిల్లీ 6 విజయాలు, 7 ఓటములతో 12 పాయింట్లు సాధించి ఏడో స్థానానికి చేరుకుంది. మరోవైపు కీలక మ్యాచ్ లో ఓడిన రాజస్థాన్ రాయల్స్ పరిస్థితి కష్టంగా మారింది. ఇప్పటివరకు 12 మ్యాచ్ లు ఆడిన ఆ జట్టు 6 విజయాలు, 6 ఓటములతో 12 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ ఓటమితో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లలో తప్పక గెలవాల్సిన పరిస్థితిలో రాజస్థాన్





# ప్లే ఆఫ్స్‌లో బెంగళూరు!

## పంజాబ్ పై 23 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘన విజయం

## పాయింట్ల పట్టికలో అగ్రస్థానం.. సంక్లిష్టంగా పంజాబ్ ఆశలు



**ఐ పీ ఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అదరగొట్టింది. ఆదివారం హెచ్ పీ సీ ఏ స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్ పై 23 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో ఆర్సీబీ అధికారికంగా ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించగా.. లక్ష్య ఛేదనలో చతికిలబడిన పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలు మాత్రం అత్యంత సంక్లిష్టంగా మారాయి.**

ఆదివారం హెచ్‌పీసీఏ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించి ప్రత్యర్థి ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో పంజాబ్ బ్యాటర్లు తడబడటంతో ఆ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 199 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది.

### అయ్యర్, కోహ్లీ విజృంభణ..

తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు బ్యాటర్లలో ఓపెనర్ విరాట్ కోహ్లీ 37 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. దేవదత్ పడిక్కల్ సైతం వేగంగా ఆడి 25 బంతుల్లో 45 పరుగులతో రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వెంకటేష్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 40 బంతుల్లోనే అజేయంగా 73 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన వెంకటేష్ అయ్యర్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. పంజాబ్ బౌలర్లలో హర్ ప్రీత్ బ్రార్ 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. యుజువేంద్ర చాహల్ 3 ఓవర్లలో 42 పరుగులిచ్చి ఒక వికెట్, అర్షదీప్ సింగ్ 4 ఓవర్లలో 43 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టారు.

### పంజాబ్ తడబాటు..

223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. బెంగళూరు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పంజాబ్ బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. మిడిలార్డర్ లో శశాంక్ సింగ్ కేవలం 27 బంతుల్లో 56 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. కూపర్ కొన్నోలీ 22 బంతుల్లో 37 పరుగులు, మార్కస్ స్టోయినిస్ 25 బంతుల్లో 37 పరుగులతో కాస్త ప్రతిఘటించినా భారీ లక్ష్యం కావడంతో ఫలితం దక్కలేదు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ 4 ఓవర్లలో 38 పరుగులిచ్చి 2 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా.. రొమారియో షెపర్డ్ ఒక ఓవర్ వేసి 8 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు.

### దర్జాగా క్వాలిఫై..

ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆర్సీబీ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పటివరకు ఆడిన 13 మ్యాచ్ లలో 9 విజయాలు, 4 ఓటములతో ఏకంగా 18 పాయింట్లు సాధించి దర్జాగా ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. బెంగళూరు నెట్ రన్ రేట్ సైతం ప్లస్ 1.065 కు చేరుకుంది. మరోవైపు కీలక మ్యాచ్ లో ఓడిన పంజాబ్ కింగ్స్ పరిస్థితి దయనీయంగా మారింది. 13 మ్యాచ్ లు ఆడిన పంజాబ్ 6 విజయాలు, 6 ఓటములతో 13 పాయింట్లు సాధించి పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ ఓటమితో ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు కష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లలో ఇతర జట్ల ఫలితాలపై పంజాబ్ ప్లే ఆఫ్స్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.







రాజముద్ర



# పెద్ది'లో జగపతిబాబు లుక్ వైరల్

హైదరాబాద్, మే 17: పెద్ది సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్న వేళ చిత్ర బృందం మరో పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో అభిమానులను ఉర్రూతలూగించింది. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న జగపతిబాబుకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. 'అప్పలసూరి' పేరుతో విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "భావోద్వేగాలతో నిండిన పాత్ర.. లక్ష్యంతో ముందుకు సాగే వ్యక్తి" అనే భావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ వీడియోలో జగపతిబాబు చాలా రస్టిక్, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో కనిపిస్తున్న ఆయన గెటప్, గంభీరమైన ఎక్స్‌ప్రెషన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌లు, పాటలు ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'చికిరి చికిరి', 'రాయ్ రాయ్ రా రా' పాటలు సోషల్ మీడియాలో మంచి స్పందన దక్కించుకున్నాయి. ఇప్పుడు 'అప్పలసూరి' గ్లింప్స్ రావడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. మే 18న ముంబైలో ఈ సినిమా ట్రైలర్‌ను భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ట్రైలర్‌పై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, యాక్షన్, ఎమోషనల్ డ్రామా మేళవింపుతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జూన్ 4, 2026న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై అంచనాలు మరింత పెరగనున్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# 'జైలర్ 2'పై భారీ అంచనాలు



**చెన్నై, మే 17:** జైలర్ 2 సినిమాపై సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. రజినీకాంత్ హీరోగా నటిస్తున్న ఈ భారీ చిత్రాన్ని నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం ఘన విజయం సాధించడంతో సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో రజినీకాంత్ పోషిస్తున్న 'ముత్తువేల్ పాండ్యన్' పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగానికి ముందు జరిగిన సంఘటనలను చూపించే ప్రీక్వెల్ తరహా ఎపిసోడ్‌లతో పాటు.. తర్వాతి కథను కొనసాగించే పూర్తి స్థాయి సీక్వెల్ అంశాలను కూడా సినిమాలో మేళవించనున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రంలో ప్రముఖ నటుడు, దర్శకుడు ఎస్ జే సూర్య విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అలాగే అతిథి పాత్రల్లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది. మొదటి భాగంలో విలన్‌గా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న వినాయకన్ ఈసారి ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి మరోసారి సంగీతం అందించనున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మాస్ బీట్‌లపై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజా ప్రచారం ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా.. 'జైలర్ 2'కు సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కాన్స్ వేదికపై మెరిసిన కల్యాణీ ప్రియదర్శన్



కల్యాణీ ప్రియదర్శన్ తాజాగా అంతర్జాతీయ సినీ వేడుక అయిన కాన్స్‌ఫిల్మ్‌ఫెస్టివల్‌వేదికపై తొలిసారి అడుగుపెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో తన సహజ నటనతో గుర్తింపు తెచ్చుకున్న ఈ హోమ్లీ బ్యూటీ, రెడ్ కార్పెట్‌పై తన రాయల్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ అండ్ పర్పుల్ కలర్ కలయికలో రూపొందించిన స్ట్రాప్‌లెస్ గౌన్‌లో ఆమె ఎంతో హుందాగా కనిపించారు. ఈ దుస్తులకు అనుగుణంగా ధరించిన విలాసవంతమైన నగలు ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ముఖ్యంగా ఆమె ధరించిన ప్రత్యేక నెక్లెస్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఈ నెక్లెస్‌ను కల్యాణ్ జ్యువెల్లర్స్‌ప్రత్యేకంగా రూపొందించింది. 14 క్యారెట్ల వైట్ గోల్డ్‌తో తయారైన ఈ హారంలో భారీ నీలమణి రత్నంతో పాటు వందలాది వజ్రాలను అమర్చారు. అలాగే గులాబీ వర్ణపు అరుదైన రత్నాలు కూడా ఇందులో మెరిశాయి. దీనికి సరిపోయేలా రూపొందించిన చెవిపోగులు ఆమె రూపానికి మరింత గ్రాండ్ లుక్‌ను తీసుకొచ్చాయి. ఆమె మేకప్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెవీ మేకప్‌కు దూరంగా ఉండి, సాఫ్ట్ గ్లామ్ స్టైల్‌ను ఎంచుకున్నారు. పింక్ షేడ్స్‌తో చేసిన మేకప్, ఓపెన్ కర్ల్స్ హెయిర్ స్టైల్‌తో ఆమె ఎంతో ఎలిగెంట్‌గా కనిపించారు. దక్షిణ భారత సినీ పరిశ్రమకు అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తూ కల్యాణీ ప్రియదర్శన్ చేసిన ఈ అరంగేట్రం అభిమానులను గర్వపడేలా చేసింది.

# వెంకటేశ్ - త్రివిక్రమ్ సినిమాపై పెరుగుతున్న అంచనాలు

వెంకటేశ్, త్రివిక్రమ్‌కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కుటుంబ కథా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం పూర్తి స్థాయి కుటుంబ వినోద చిత్రంగా ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వెంకటేశ్ నటించిన ఓ పాత విజయవంతమైన చిత్రంలోని ప్రముఖ గీతాన్ని కొత్తగా వినిపించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఏ గీతాన్ని ఎంపిక చేశారనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. త్రివిక్రమ్ సినిమాల్లో సంభాషణలు, సంగీతం, భావోద్వేగాలకు ప్రత్యేక స్థానం ఉంటుందనే విషయం తెలిసిందే. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా చూపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో వెంకటేశ్ పాత పాటను ఈ సినిమాలో ఎలా ఆవిష్కరిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు వినోదం, హాస్యం, యాక్షన్ అంశాలతో కూడిన కమర్షియల్ చిత్రంగా తెరకెక్కనున్నట్లు సమాచారం. వెంకటేశ్ సహజ హాస్యానికి త్రివిక్రమ్ మాటలు జతకావడంతో మరో విజయవంతమైన కుటుంబ కథా చిత్రం సిద్ధమవుతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. సినిమా నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని త్రివిక్రమ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చిత్రాన్ని రూపొందిం చేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ పూర్తి చేసి వచ్చే వేసవిలో సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.







# ఒక్క మగాడితోనే ఉండాలని నా కూతురికి చెప్పను

## కియారా వ్యాఖ్యలు వైరల్

కియారా అద్వాని చేసిన తాజా వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రేమ, పెళ్లి, సంబంధాల విషయంలో తన కూతురికి పూర్తి స్వేచ్ఛ ఇస్తానని ఆమె వెల్లడించారు. బాలీవుడ్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమించి వివాహం చేసుకున్న కియారా.. ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నానని చెప్పారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. ఈ తరం యువత సంబంధాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఒక్క అబ్బాయితోనే డేటింగ్ చేసి అతడినే పెళ్లి చేసుకోవాలని నేను నా కూతురికి చెప్పను. జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. ఎవరైనా నచ్చితే ప్రేమించవచ్చు.. లేకపోతే వద్దనుకోవచ్చు. సంబంధాల్లో జరిగే అనుభవాలే జీవితానికి పాఠాలు నేర్పిస్తాయి" అని కియారా పేర్కొన్నారు. తప్పులు చేయడం సహజమని, వాటి నుంచే మనిషి ఎన్నో నేర్చుకుంటాడని ఆమె అభిప్రాయపడ్డారు. పిల్లలపై కఠిన నియమాలు మోపడం కంటే, వారికి నిర్ణయ స్వేచ్ఛ ఇవ్వడం ముఖ్యమని చెప్పారు. కియారా చేసిన ఈ వ్యాఖ్యలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# 'ధురంధర్'పై సోషల్ మీడియాలో భారీ చర్చ

**ముంబై, మే 17:** ధురంధర్ సినిమాపై ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చ సాగుతోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం విడుదల అనంతరం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కించుకుందనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా 'ధురంధర్ 2: ది రివెంజ్' థియేటర్లలో మంచి వసూళ్లు సాధించిందని, పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయి కలెక్షన్లు నమోదు చేసిందని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. భారత్-పాకిస్థాన్ నేపథ్యంలో సాగే అంశాలు సినిమాలో ఉన్నప్పటికీ, అక్కడి ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ వస్తోందని నెటిజన్లు పేర్కొంటున్నారు. సినిమాను ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వీక్షించడంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని కూడా ప్రచారం సాగుతోంది. అయితే ఈ అంశాలపై సంబంధిత ఓటీటీ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, స్థానిక చిత్రాలతో పోల్చినా ఈ సినిమాపై ప్రేక్షకుల ఆసక్తి ఎక్కువగా కనిపిస్తోందని సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది. మంచి కథ, యాక్షన్, నటీనటుల ప్రదర్శన ఉంటే భాష, దేశ సరిహద్దులు అడ్డుకావని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 'ధురంధర్' సినిమా కంటెంట్, యాక్షన్ సన్నివేశాలు, దర్శకత్వం, సంగీతంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ కొనసాగుతోంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com